# విజేత

## మినీ కథ



సత్యరాజు, రుక్మిణి అన్నదమ్ముల బిడ్డలు. భర్త మరణంతో తన బిడ్డ విజయతో పాటు పుట్టింట్లోనే ఉంది రుక్మిణి. ఆస్తిలో సగభాగం తనదైనా... ఏనాటికైనా తన బిడ్డ విజయ ఆ ఇంటి కోడలే అనే ఉద్దేశ్యంతో ఆస్తి వ్యవహారాల బాధ్యతంతా సత్యరాజు కప్పగించి నిశ్చింతగా ఉంది రుక్మిణి.

తన కొడుకు చంద్రశేఖర్‌కీ, విజయకీ పెళ్ళి చేసేందుకెటువంటి అభ్యంతరమూ లేదు సత్యరాజుకు. కాని తండ్రీ, పెద తండ్రీ, బావగారూ పోవడంతో చిన్న వయసులోనే ఆస్తి మీద సర్వాధికారాలూ సంక్రమించడంతో... మితి మీరిన అహంకారం, తనమాటే నెగ్గాలనే నిరంకుశ ధోరణీ అలవడింది అతడికి. ఎంతటి వారినైనా తూలనాడే మన స్తత్వం అలవాటై పోయింది. అంతవరకూ బావగారూ, బావగారంటూ అడుగులకు మడుగులొత్తిన సత్యరాజు తరుచూ విజయను రెచ్చగొట్టేందుకు రామరాజును దూషిస్తూ మాట్లాడం విజయ సహించలేకపోయేది. తండ్రిని తిడుతున్నందుకు మేనమామపై కోపం, దాన్ని వారించక సమర్థించినట్లు మాట్లాడే తల్లిని చూస్తే విసుగూ వచ్చిన విజయ తరుచూ ఎదురు తిరిగి చివాట్లు తినేది.

ఆచారాలు సంప్రదాయాల పేరుతో ఇంట్లో ఆడవాళ్ళను అణచి ఉంచాలనే సత్యరాజు ధోరణిని నిత్యం ప్రతిఘటిస్తూనే ఉండేది. అందులో గెలుపెవరిదైనా ఆ మామా కోడళ్ళ మధ్య నిత్యం ప్రచ్ఛన్న యుద్ధం కొనసాగుతూనే ఉండేది.

ఆ ఇంట్లో విజయకు ఏకైక ఆప్తుడు చంద్రాయే! విజయంటే చంద్రాకు పంచ ప్రాణాలు. కానీ ఇంట్లో జరిగే అరాచకాన్ని ఎదిరించి విజయను ఆదుకోలేని అశక్తుడు. ఆ అశక్తతే విజయను అతన్నుండి విడదీసింది.

విజయ నోరెత్తకుండా పడుండేలా చేసేది పెళ్ళే గనుక ఆ ఇంట్లో ఎవరినీ సంప్రదించకుండానే ముహూర్తాలు నిర్ణయించేశాడు. ఇంకా చదువుకోవాలనీ, పెద్ద డాక్టరై పేదలకు ఉచిత వైద్యమందించి తండ్రి ఆశలు తీర్చాలని కలలుగన్న విజయ షాకయ్యిందావార్త విని. అందర్నీ బతిమాలింది చదువుకో నిమ్మని. అదంతా అరణ్య రోదనే అయింది. అందరూ విజయనే తిట్టారు.

విజయ మనసు నొప్పించలేక తండ్రిని ఒప్పించలేక నలిగిపోయాడు చంద్ర. ఇంట్లో జరిగే తతంగానికి మౌన ప్రేక్షకుడిలా మిగిలిపోయాడు.

తనని ఏదో సాధించాలని చూస్తున్న మేనమామని ఎదిరించడానికే నిశ్చయించుకుంది. తన ఆశలనూ, ఆశయాలనూ నిలబెట్టుకునేందుకు, చిన్ననాటి నుండీ హరించబడిన స్వేచ్ఛ కోసం తన కత్యంత ఆప్తుడైన చంద్రతో చిన్ననాటినుండీ పెంచుకున్న అనుబంధాన్నీ, లక్షలాస్తినీ, కన్నతల్లినీ వదులుకొని ఇరుగు పొరుగులూ బంధువర్గం అపహాస్తం చేస్తున్నా లక్ష్యపెట్టక అచంచల ఆత్మవిశ్వాసంతో ఇల్లు విడిచి వచ్చేసింది.

విజయ నిర్ణయాన్ని మనస్ఫూర్తిగా ఆమోదించి చేయూతనిచ్చిన ఏకైక వ్యక్తి విజయ దూరపు బంధువు లచ్చి[illegible]. అజ్ఞాతంగా ఆర్థిక సాయం అందించి విజయ చదువు కొనసాగేందుకు సహకరించింది సత్యరాజు భార్య వసుంధర.

తనను ఎదిరించిన విజయ ఓటమిపాలై తన [illegible]ళ్ళ దగ్గరకు రావాలంటే ఎలాంటి ఆర్థిక సాయమూ విజయకు అందరాదని అనుకున్న సత్యరాజు చంద్రాకీ విజయకూ మధ్య ఉత్తరాలు నడవకుండా కట్టుదిట్టం చేశాడు.

వసుంధర ముందుచూపు వల్లన విజయ చదువు నిరాటంకంగా కొనసాగింది. ఓటమి సహించని సత్యరాజు చంద్రా మెడలు వంచి శ్యామలతో పెళ్ళి జరిపించాడు.

తల్లి మరణానంతరం తండ్రి చేసిన ఏర్పాటు తెలుసుకొని మొదటిసారిగా తండ్రిని నిలదీసి భార్యా బిడ్డలతో ఇల్లు విడిచే ప్రయత్నం చేశాడు. భార్యా వియోగంతో మనసు చెదిరిన సత్యరాజు కొడుకు కూడా తనని విడిచి వెళ్ళే ప్రయత్నం చేయడంతో తన పాపం బద్దలైనట్లుగా గ్రహిస్తాడు. పక్షవాతమొచ్చి పడిపోవడంతో తిరిగి తండ్రిని వదిలి వెళ్ళలేక ఇంట్లోకి వస్తాడు.

ఎన్ని ఉత్తరాలు రాసినా చంద్ర నుండి ఎలాంటి సమాధానం పొందని విజయ వారందరినీ చూడాలని ఉన్నా అక్కడికి వెళ్ళేందుకు ఆత్మాభిమానం అడ్డు రాగా తనవారి మీద, ఊరి మీద గల మమకారాన్ని మరలించుకుని పూర్తిగా వృత్తికే అంకితమై పని చేయసాగింది. ఆమె సేవాభావం, విశిష్ట వ్యక్తిత్వం డాక్టర్ వినోద్‌ను ఆకర్షిస్తాయి. వినోద్ సూటిగా విజయను పెళ్ళి చేసుకుందాం అని అడగడంతో నా జీవితంలో ప్రేమా పెళ్ళి ముగిసిపోయిన అధ్యాయాలంటూ తన గతమంతా వినోద్‌కు వివరిస్తుంది. వినోద్, రాధికలు ఎంతో నచ్చజెప్పిన మీదట అంగీకరిస్తుంది పెళ్ళికి.

విజయా వినోద్‌లు పాలూ తేనెలా వృత్తిలోనూ, జీవితంలోనూ కలిసిపోయి ఎంతో పేరు ప్రతిష్ఠలు సంపాదించారు. ఇద్దరూ హృద్రోగ నిపుణులు కావడంతో రోజుల పాపకు శస్త్ర చికిత్స చేసి ఆ పాపను బ్రతికించి పెద్ద సంచలనాన్ని సృష్టించారు. అది వార్తా పత్రికలో చదివిన చంద్రా ఆ విధంగా మరదలి ఆచూకీ తెలియడంతో ఆ భార్యా భర్తలిద్దరినీ తన కూతురి పెళ్ళికి రావలసిందిగా ఆహ్వానిస్తాడు.

ఏ ఊరి నుండయితే అనేక అవమానలతో తరిమి వేయబడిందో అదే ఊరికి ఒక గొప్ప వ్యక్తిగా అందరి గౌరవాహ్వానాల మధ్యా అడుగు పెట్టింది విజయ. తిట్టిన నోటితోనే అభినందనల వర్షం కురిపించారు.

**- పి. హేమవతి**